క్లుప్తంగా

నేడు కదిరి పున్నమి ఉత్సవాలు

అమరాపురం: తమ్మడేపల్లి గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం కదిరి పున్నమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు. ఉత్సవాలు ఉదయం నుంచి రాత్రి వరకూ నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఎఫ్‌ఏ-4 పరీక్షల పరిశీలన



పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ గంగప్ప

హిందూపురం టౌన్: మండలంలోని ఊడుగులపల్లి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న ఎఫ్‌ఏ 4 పరీక్షలను శుక్రవారం ఎంఈఓ గంగప్ప పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ నెల 14న విద్యార్థులకు ట్యాబ్లెట్స్ అందించనున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని ప్రధానోపాధ్యాయుడు రవికి సూచించారు.

చౌడేశ్వరీదేవి ఆలయానికి నూతన శోభ

లేపాక్షి: మండలంలోని చోళసముద్రంలో చౌడేశ్వరీదేవి దేవాలయం ఎదుట 70 అడుగుల పొడవునా మెట్లను నిర్మించడంతో నూతన శోభ సంతరించుకుంది. గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ సి.ఆర్.కేశవమూర్తి రూ.1.5 లక్షల ఖర్చుతో మెట్లు నిర్మింపజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు దాతను అభినందించారు.

కల్యాణ మంటపం నిర్మాణానికి భూమి పూజ

రొళ్ల: కాల్వేపల్లి గ్రామంలో వెలసిన రంగనాథ స్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు కల్యాణ మంటపం నిర్మాణానికి భూమి పూజ చేశారు. తొలుత రంగనాథస్వామికి పూజలు నిర్వహించారు. భక్తులతో పాటు దాతల సహకారంతో రూ.కోట్ల వ్యయంతో కల్యాణ మంటపం నిర్మిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపిక



విద్యార్థిని భావనను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

హిందూపురం టౌన్: ఈ నెల 15 నుంచి 21 వరకూ బెంగళూరులో జరిగే జాతీయ సమైక్యతా శిబిరానికి పట్టణంలోని ఎస్‌డీజీఎస్ డిగ్రీ కళాశాలకు చెందిన బీబీఏ తృతీయ సంవత్సరం విద్యార్థిని భావన ఎంపికయ్యింది. ఈ మేరకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త మురళీధర్ రావు తెలిపినట్లు ప్రిన్సిపాల్ జేఎస్‌వీఎస్ ప్రసాద్ తెలిపారు.

ఈ సందర్భంగా విద్యార్థిని భావనను కళాశాల అధ్యక్షుడు చంద్రమోహన్, కార్యదర్శి బైసాని రామ్‌ప్రసాద్ అభినందించి, సత్కరించారు. అలాగే ప్రిన్సిపాల్ ప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త రాజన్న, ఎన్‌సీసీ అధికారి ఫణీంద్ర, అశ్వర్థ నారాయణలు విద్యార్థిని భావనను అభినందించారు.

మద్యం విక్రేత అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని వీరాపురం పంచాయతీ హస్సేన్‌పురం గ్రామంలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న లక్ష్మీనారాయణ అనే వ్యక్తిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 42 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

నోటికి కడ్డీలతో మొక్కులు

పావగడ: తాలూకా లోని కరెక్యాతనహళ్లి, మద్దె గ్రామాల్లో జరుగుతున్న స్వారమ్మ దేవి, శంకరలింగేశ్వరస్వామి జాతరలో కొందరు మహిళలు నోటికి కడ్డీలు గుచ్చుకుని మొక్కులు తీర్చుకున్నారు. అంతకముందు ఆలయాల్లో స్వామికి పూజలు నిర్వహించారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

హిందూపురం: హిందూపురం రూరల్ యూపీఎస్ పరిధిలో 2022-23 సంవత్సరాల్లో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని శుక్రవారం పోలీసులు ధ్వంసం చేశారు. సీఐ కృష్ణారెడ్డి, సెబ్ సీఐ స్వర్ణలత ఆధ్వర్యంలో 35 కేసుల్లో 15,102 టెట్రా ప్యాకెట్లలో 1602 లీటర్ల మద్యాన్ని పట్టణంలో ఎస్‌డీజీఎస్ కళాశాల వెనుక వైపు ట్రాక్టర్‌సాయంతో ధ్వంసం చేశారు. వాటి విలువ రూ.6,72,000 ఉంటుందని వారు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



మడకశిర రూరల్: ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, పరిశీలకుడు అశోక్‌కుమార్



టీచర్లను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్, చైర్‌పర్సన్ ఇంద్రజ, నాయకులు



రొద్దం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

మడకశిరరూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, నియోజకవర్గ పరిశీలకులు అశోక్‌కుమార్ పట్టభద్రులు, ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. వారు శుక్రవారం అమిదాలగొంది, బుళ్లసముద్రం ఉన్నత పాఠశాలలు, సూర్య విద్యానికేతన్, గ్రామ సచివాలయాలు, వెంకటేశ్వర డిగ్రీ కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు సమష్టిగా ఓటర్ల ఇంటికి వెళ్లి ఓట్లు అడగాలన్నారు. సింగిల్ విండో అధ్యక్షులు రామిరెడ్డి, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, వైస్ ఎంపీపీ శ్రీరామరెడ్డి, సర్పంచులు గీత, రంగమ్మ, కరియన్న, ఉప సర్పంచ్ రంగస్వామి, మాజీ ఎంపీపీ బజ్జప్ప, తిరుపతి బండ్ల లక్ష్మీపతి, గోరంట్ల సురేష్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల నాయకులు జమ్మానిపల్లి మూర్తి, రంగనాథ్, తిప్పన్న, బీసీ సెల్ నాయకులు సత్యనారాయణ,హనుమంతరాజు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మడకశిర: ఎమ్మెల్సీ ఎన్నికలు వైఎస్సార్‌సీపీకి చాలా ప్రతిష్టాత్మకమని ఎమ్మెల్యే తిప్పేస్వామి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో నియోజకవర్గంలోని జేసీఎస్ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో వారు సమావేశమయ్యారు. సోమవారం జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు కేవలం రెండు రోజుల సమయం మాత్రమే ఉందని, వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవడానికి కృషి చేయాలని కోరారు. తిరుపతి పట్టణ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు బండ్ల లక్ష్మీపతి, గోరంట్ల వైఎస్సార్‌సీపీ నేత సురేష్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ జేసీఎస్ కన్వీనర్లు విక్రమ్, శివకుమార్, శ్రీనివాసరెడ్డి, నాగేంద్రయాదవ్, రొళ్ల నాగేంద్ర, శివన్న, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అమరాపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించాలని రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని కోరారు. శుక్రవారం బసవనపల్లి, హేమావతి, 1, 2 గ్రామ సచివాలయంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పార్టీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. గద్దం నరసేగౌడ్ తదితరులు ఉన్నారు.

గుడిబండ: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రరెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించాలని ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, జేసీఎస్ కన్వీనర్ కె.శివకుమార్ కోరారు. శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాల్లో ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌లు యంజారేగౌడు, రంగస్వామి, లక్ష్మీనారాయణ, సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎస్సీసెల్ మండల కన్వీనర్ రమేష్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ కోరారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదులకు కరపత్రాలు అందజేసి ఓట్లు అభ్యర్థించారు. అలాగే దీప్తి స్కూల్, వివేకానంద మిలీనియం స్కూల్ తదతర ప్రాంతాల్లో పర్యటించి పట్టభద్రులు, టీచర్లతో వైఎస్సార్‌సీపీ బలపర్చుతున్న అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాల అభ్యున్నతి, ప్రతి కుటుంబానికి సంక్షేమఫలాలు నేరుగా అందుతున్నాయని, విద్యపై సామాజిక పెట్టుబడి పెడుతూ విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. టీడీపీ పాలనలో యువతకు ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తానని, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని మోసం చేశారని గుర్తుచేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, ఏపీపీ ఇందాద్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు లోకేష్, కౌన్సిలరు పాల్గొన్నారు. రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్ ఉదయ్‌కుమార్, గంగిరెడ్డి తదితరులు వేర్వేరుగా వివిధ స్కూళ్లు, సచివాలయాలతోపాటు ఓటర్ల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేపట్టారు.

రొద్దం: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ కోరారు. శుక్రవారం రొద్దం, తురకలాపట్నం, కోగిర, పెద్దగువ్వలపల్లి తదితర గ్రామాల సచివాలయాలు, పాఠశాలల్లో ఆయన ప్రచారం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చి మాటనిలబెట్టుకున్నారన్నారు. ఈ నెల 13న జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, సచివాలయ సమన్వయకర్త ఆర్‌పీ రవిశేఖర్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రాజ్‌గోపాల్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు రాజారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం కాపాడాలి

పరిగి: పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి నవీన, ఎంపీడీఓ సరస్వతి పేర్కొన్నారు. ఈనెల 14న నిర్వహించే జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ సరస్వతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన మాట్లాడారు. గైర్హాజరైన విద్యార్థులకు ఈనెల 18న మరోసారి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వన్నప్ప, జెడ్పీహెచ్ పాఠశాల కృపా సత్యరాజు, అధికారులు, అంగనవాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో వాటర్‌మెన్ మృతి

పరిగి: మండల కేంద్రం పరిగి మేజర్ పంచాయతీలో వాటర్‌మెన్ గోవిందప్ప (56) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. 25 ఏళ్లుగా పని చేస్తున్న గోవిందప్ప మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. గురువారం హిందూపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. డీఎల్‌పీఓ విజయకుమార్ మృతదేహాన్ని సందర్శించి, ఆ కుటుంబానికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. సర్పంచ్ లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివశంకర్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ

గుడిబండ: మండలపల్లి ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో రూ.1.25 కోట్లతో 6 తరగతి గదులు నిర్మించనున్నారు. శుక్రవారం ఎంఈఓ శ్రీధర్ గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తోందన్నారు. అలాగే పేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత చదువులు అందిస్తోందన్నారు. సర్పంచ్ అశ్వత్, హెచ్‌ఎం విశ్వనాథ్‌రెడ్డి, ఆర్డీటీ సిబ్బంది సావిత్రి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఇంద్ర బస్సుల్లో 10 శాతం రాయితీ

హిందూపురం టౌన్: హిందూపురం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఇంద్ర ఏసీ సర్వీస్ బస్సుల్లో ప్రయాణికులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్ ఇచ్చినట్లు డీఎం శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. స్థానిక డిపో నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఇంద్ర బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు చార్జీలలో 10 శాతం రాయితీను ఇస్తున్నామన్నారు. రోజూ రాత్రి 9 గంటలకు హిందూపురం నుంచి బయలుదేరి ఉదయం 7 గంటలకు బీహెచ్‌ఈఎల్ చేరుతుందన్నారు. అలాగే బీహెచ్‌ఈఎల్‌లో రాత్రి 9.30 గంటలకు బయలుదేరి హిందూపురానికి ఉదయం 8 గంటలకు చేరుతుందన్నారు. ప్రయాణికులకు టీవీ, దుప్పటి, ఫేస్ కిట్, శానిటైజర్, వాటర్ బాటిల్, ప్రతి సీటుకు సెల్‌ఫోన్ చార్జింగ్ సౌకర్యం కల్పించామన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత చౌళూరు మధుమతిరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు

హిందూపురం : మండలంలోని చెర్లోపల్లి, రాచేపల్లి, చలివేందుల, మలుగూరు, కగల్లు, 33వవార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి, కౌన్సిలర్లు శివ, ఆసీఫ్‌వుల్లా, పార్టీ నాయకులు నాగరాజు, దాదు, చంద్ర, లోకేష్, అనిల్‌రెడ్డి తదితరులతో కలిసి స్కూళ్లు, సచివాలయాల్లో పర్యటించి పట్టభద్రులు, టీచర్లకు కరపత్రాలు అందించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. అలాగే వివిధ వార్డుల్లో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు.

గోరంట్ల: ఈనెల 13న జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం గోరంట్లలోని ఎమ్మార్సీ, బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, మూడో సచివాలయలంలో ప్రచారం చేశారు. ఉపాధ్యయులు, సచివాలయ ఉద్యోగులతో ఎమ్మెల్యే శంకరనారాయణ కలసి త్వరలో జరగబోవు ఎన్నికల్లో వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్, టౌన్ కన్వీనర్ ధనుంజయరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకర్‌రెడ్డి, గోరంట్ల మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు నూర్‌మహమ్మద్, మాజీ టౌన్ కన్వీనర్ మేదర శంకర, సచివాలయ మండల కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు రాజారెడ్డి, నాగేనాయక్, నరసింహారెడ్డి, కురబ సత్యనారాయణ, రామచంద్రారెడ్డి, సుధాకరరెడ్డి, తులసి వీరనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



భక్తరహళ్లిలో మానవహారంగా ఏర్పడిన మహిళలు

మడకశిరరూరల్: మండలంలోని భక్తరహళ్ళి, గోవిందాపురం గ్రామాల్లో శుక్రవారం ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళలు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏటీఎల్ నారాయణస్వామి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని ప్రతిజ్ఞ చేశారు. ప్రజా ప్రతినిధులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

రొద్దం: పెద్దమంతూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా ఉద్యోగులు, ఏఎన్‌ఎం, ఆశా, వలంటీర్, యానిమేటర్, అంగన్‌వాడీ వర్కర్లను సన్మానించారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వెంకటేశ్వర కల్యాణమంటపంలో ఐద్వా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి గౌతమి మాట్లాడుతూ మహిళలు అక్షరాస్యతతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఐద్వా సంఘం నాయకురాళ్లు గాయత్రి, శ్రీదేవి, త్రివేణి పాల్గొన్నారు.

లేపాక్షి: స్థానిక వెలుగు కార్యాలయంలో నందీశ్వర మహిళ సమాఖ్య అధ్యక్షురాలు గాయిత్రమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మండలంలోని వివిధ డ్వాక్రా సంఘాల మహిళలు, వెలుగు సిబ్బంది శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీ, డీపీఎం రామిరెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ విశిష్టతను, ప్రాముఖ్యతను వివరించారు.

సంక్షిప్త సమాచారం

చిన్నారులకు ఆల్‌బెండజోల్ వేయండి

చిలమత్తూరు: జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యాధికారిణి తేజశ్విని, ఎంఈఓ నాగరాజులు నులిపురుగుల నివారణపై సచివాలయ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ 19 ఏళ్ల వయసులోపు వారికి అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని, ఆ దిశగా పాఠశాలలు, గ్రామాల్లో పర్యటించి మాత్రలు ఇవ్వాలన్నారు. నులిపురుగుల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత దృష్టి సారించేలా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు..

సావిత్రిబాయి పూలే వర్ధంతి

హిందూపురం టౌన్: బీఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే వర్ధంతిని స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి హరికుమార్, బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు, నారాయణ, రిటైర్డ్ ఎంఈఓ పెన్నయ్య, ఆదినారాయణ, రూరల్ మండల అధ్యక్షుడు అంజినప్ప, చంద్రశేఖర్, చిరంజీవి, గంగాధర్, ప్రసాద్, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై సమావేశం

లేపాక్షి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీడీఓ నరసింహనాయుడు అధ్యక్షతన శుక్రవారం ఉదయం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతు ఈ నెల 14 నుంచి నిర్వహించే కార్యక్రమంలో పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు ఇవ్వాల్సిందిగా సూచించారు. డాక్టర్ రాజకుమార్, ఎంఈఓ నాగరాజు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రొళ్ల: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ కవిత మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఈనెల 14న మధ్యాహ్న భోజనం తర్వాత నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. మండల పరిషత్ ఏఓ ఆరాధ్య, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, సీహెచ్‌ఓ ఈశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఈఓ షమివుల్లా, ఆరోగ్య, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల మాత్రలు తప్పక వేయాలి

అమరాపురం: మండలంలోని 2 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు తప్పక వేయాలని అమరాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి అంబరీష్, ఎంపీడీఓ మునిస్వామి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలు, ఆరోగ్య సిబ్బందితో ఎంఈఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 14న జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, జూనియర్ కళాశాలలు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మాత్రలను వేయాలని నిర్దేశించిందన్నారు. మండలంలో హేమావతి పీహెచ్‌సీ పరిధిలో 4,490, అమరాపురం పీహెచ్‌సీ పరిధిలో 6,130 పిల్లలున్నారన్నారు.

రూ.లక్ష రికవరీకి ఆదేశం

రొద్దం: మండలంలో 2021-22లో రూ.14 కోట్ల ఉపాధిహామీ పనులు జరగ్గా, అందులో రూ.లక్ష అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సభలో తేల్చారు. రొద్దం మండలంలో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి 31 వరకూ 19 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం పెనుకొండ ఎంపీడీఓ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సభ నిర్వహించారు. పనుల్లో సామాజిక బృందం తేల్చిన నివేదికలను సమావేశంలో డీఆర్‌పీలు చదివి వినిపించారు. అందుల్లో రికవరీ, పెనాల్టీ మొత్తం రూ.లక్ష దాకా ఉందని నివేదికలో చెప్పారు. కార్యక్రమంలో పీడీ రామాంజనేయులు, ఏపీడీ జయసింహ, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, ఏపీఓ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇంటింటా ఫీవర్ సర్వే

మడకశిర: మండలంతో పాటు మడకశిర నగరపంచాయితీ పరిధిలో ఇంటింటా ఫీవర్ సర్వే పారదర్శకంగా నిర్వహిస్తునట్లు మడకశిర డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఫీవర్ సర్వేపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దగ్గు, జ్వరం, జలుబుతో బాధపడుతున్న పిల్లలను పాఠశాలలకు పంపొద్దని తల్లిదండ్రులకు సూచించారు.ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించేలా వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ సోనిబాయి, ఎంఈఓ భాస్కర్, హెచ్‌ఎంలు, వైద్య, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయండి

గోరంట్ల: ఆయుష్మాన్ భారత్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ రఘునాథగుప్త పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయుష్మాన్ భారత్ సర్వే, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు.

పూలపల్లకీలో లక్ష్మీనరసింహస్వామి

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి పూల పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి సుప్రభాత సేవలు, అష్టోత్తర, విష్ణుసహస్ర నామాలు, అభిషేకం, అంకురార్పణ తదితర పూజలు చేశారు. లక్ష్మీదేవి సమేతంగా నరసింహస్వామి వారికి వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. మేళతాళాలతో పురోహితులు ఆలయం చుట్టు ఉత్సవ విగ్రహాలతో ప్రదక్షిణలు చేసి అనంతరం ఊరేగింపుగా పల్లకీలో విగ్రహాన్ని కూర్చోబెట్టారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. వీరగాస నృత్యం చూపరులను ఆకట్టుకుంది.

కర్ణాటక యూనివర్సిటీలో విద్యార్థి ప్రతిభ

హిందూపురం: కర్ణాటక గదక్‌లోని రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీరాజ్ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ విభాగం పరీక్షల్లో హిందూపురానికి చెందిన ఎస్.తేజస్ అత్యధిక మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచి కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ ఘెలోట్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నారు. హిందూపురం సమీపంలోని సడ్లపల్లికి చెందిన ఎస్.తేజస్‌కు యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో కర్ణాటక గవర్నర్‌తోపాటు యూనివర్సిటీ ప్రెస్ గవర్నర్ తారాచంద్ బంగారు పతకం అందజేశారు. తేజస్‌కు కుటుంబసభ్యులు, బంధువులు అభినందనలు తెలిపారు.

తూతూ మంత్రంగా బడ్జెట్ సమావేశం



బడ్జెట్‌ను చదివి వినిపిస్తున్న అధ్యక్షురాలు

పావగడ: స్థానిక మున్సిపల్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన బడ్జెట్ సమావేశం తూతూ మంత్రంగా సాగింది. మున్సిపల్ ముఖ్యాధికారి జగరెడ్డి బదిలీపై వెళ్లిపోవడంతో ఆరోగ్యాధికారి షంషు ముఖ్యాధికారిగా వ్యవహరించారు. ఈ ఏడాది బాడుగ వసూళ్ల టార్గెట్ రూ.2 కోట్లు ఉండగా కేవలం రూ.80 లక్షలు వసూలు చేయడంతో రెవెన్యూ అధికారులపై కాంగ్రెస్ కౌన్సిలర్ సుదేశ్ బాబు మండిపడ్డారు. అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని హెచ్చరించారు. ప్రతి అంశంపై ఒక్క ఉదుటున లేచి ప్రశ్నించే ప్రత్యర్థి నామిని బీజేపీ కౌన్సిలర్ల గళాలు మూగపోయాయి. ఓ మహిళా కౌన్సిలర్ జాతర ఉందని మొదట్లోనే వెళ్లిపోయింది. చివరిగా అధ్యక్షురాలు ధనలక్ష్మి బడ్జెట్ ఆదాయ వ్యయాలను చదివి విన్పించారు. మున్సిపాలిటికి ఈ ఏడాది ఆదాయం రూ.603.00 లక్షలు కాగా ఖర్చు రూ 571.53 లక్షలు, మిగులు రూ 31.47 లక్షలుగా ప్రకటించడంతో పాలక సభ్యులు హర్షం వెలిబుచ్చుతూ చప్పట్లు కొట్టారు.

ఉత్తరాల ఉద్యమాన్ని చేపట్టండి



ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో వాల్మీకి సంజయకుమార స్వామిజీ

పావగడ: చారితాత్మక నిడుగల్ దుర్గం అభివృద్ధికి ప్రభుత్వం చొరవ తీసుకునేలా ఉత్తరాల ఉద్యమాన్ని చేపట్టాలని స్థానిక నిడుగల్ వాల్మీకి ఆశ్రమ పీఠాధిపతి సంజయ కుమార స్వామిజీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. తాలూకా లోని నిడుగల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ విశేష శిబిరం ముగింపు కార్యక్రమంలో స్వామిజీ మాట్లాడారు. నిడుగల్ అభివృద్ధికి విద్యార్థులు తమ వంతు కృషి చేయాలని కోరారు. తాలూకా లోని అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు 'ఓట్ ఫర్ నిడుగల్' అభియాన ను ప్రారంభించి ఉత్తరాల ఉద్యమాన్ని చేపట్టి సీఎం తో పాటు సంబంధిత పర్యాటక శాఖ మంత్రి, తదితర అధికారులకు ఉత్తరాలు రాయాలని సూచించారు. విద్యార్థులకు అభినందన ప్రమాణ పత్రాలను అందించారు. కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు రాఘవేంద్ర, రామాంజని, రాధిక, గిరిజమ్మ పాల్గొన్నారు.

వసతి పాఠశాలల ప్రారంభోత్సవం



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: తాలూకా లోని గంగసాగర గ్రామంలో ఇందిరా గాంధి వసతి పాఠశాల భవనం, దొడ్డహళ్లిలో కిత్తూరు రాణి చెన్నమ్మ వసతి పాఠశాల భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణప్ప శుక్రవారం ప్రారంభించారు. వైఎస్ హొసకోట-భీమనకుంటె రోడ్డు, తిప్పయ్యన దుర్గ-బి హొసహళ్లి రోడ్డు, కోలి మెట్ట గ్రామంలోని మారెమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా రూ.వంద కోట్ల వ్యయంతో తారు రోడ్లు వేయించానన్నారు. అభివృద్ధి పనులకు కాంగ్రెస్ పెట్టింది పేరని కొనియాడారు. కుమార స్వామి ముఖ్యమంత్రి కావడం పగటి కలేనని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తి మెజార్టీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. కాంగ్రెస్ నాయకుడు ఏ శంకరరెడ్డి, పీడబ్ల్యూ ఏఈఈ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9705346587
9010200238, 9912220726